క్లుప్తంగా

హనుమాన్ చాలీసా పుస్తకాలు పంపిణీ


పుస్తకాలు పంపిణీ చేస్తున్న శంకరయ్య

ఇచ్చోడ: ప్రతీ గ్రామానికి హనుమాన్ చాలీసా పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు గురుదాస్ మిట్లపెల్లి శంకరయ్య తెలిపారు. శనివారం రాత్రి మండల కేంద్రంలోని శివాలయంలో పుస్తకాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 70 గ్రామాల్లో హనుమాన్ చాలీసా పుస్తకాలను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.

ఆలయాభివృద్ధికి కృషి చేద్దాం

ఇంద్రవెల్లి: శ్రీసంత్ సద్గురు పూలాజీబాబా ఆలయాభివృద్ధికి గ్రామస్తులందరూ కలిసికట్టుగా రావాలని అంజీ గ్రామపెద్దలు గారుశే దశరత్, ముఖడే విష్ణులు అన్నారు. ఆదివారం మండలంలోని అంజి గ్రామంలోని శ్రీసంత్ సద్గురు పూలాజీబాబా ఆలయంలో గ్రామస్తులతో సమావేశమయ్యారు. ఈనెల 14, 15న నిర్వహించే ఆలయ వార్షికోత్సవ వేడుకల నిర్వహణపై చర్చించారు. కార్యక్రమంలో అంజీ గ్రామస్తులు బాలాజీ, రాంచదర్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైని కలిసిన నాయకులు

బేల: బేల ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన దివ్యభారతిని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం బేల మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో కలిసి ఎస్సీతో దిగిన ఫొటోను అందించి శాలువాతో సత్కరించారు. నాయకులు అవినాష్, సీతారాం, టాక్రే సాగర్, బొక్రే శంకర్, కన్య రాజు, నాయన్ పాల్గొన్నారు.

బాల మల్లేశ్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్.బాలమల్లేశ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఆ పార్టీ నాయకులు నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు మిట్టపల్లి పౌలు, పట్టణ కార్యదర్శి ఖలీందర్ అలీఖాన్, జిల్లా కార్యవర్గ సభ్యులు లింగం రవి, నర్సయ్య, రాజలింగు పాల్గొన్నారు.

భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి

బోథ్: బోథ్‌లోని సామాజిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేయాలని ధర్మ సమాజ్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం నిర్మాణంలో ఉన్న భవనాన్ని పరిశీలించారు. భవన నిర్మాణ విషయమై ఏఈ ప్రశాంత్‌తో మాట్లాడారు. అనంతరం వైద్యుల గురించి సూపరింటెండెంట్ రవీంద్ర ప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కొండమడుగు గణేశ్, వెంకటేశ్, సుధాకర్, నరేందర్, అన్నెల లక్ష్మణ్ పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చడం అభినందనీయం

కైలాస్‌నగర్: సంగెం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదల ఆకలి తీర్చడం అభినందనీయమని అమన్ ఫౌండేషన్ అధ్యక్షుడు అర్బాత్ ఖాన్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని పేదలకు అన్నం అడ్డించారు. కార్యక్రమంలో న్యాయవాది సుధీర్ కుమార్ సంగెం, సలీమ్, రాజయ్య పాల్గొన్నారు.

అమరుల ఆశయ సాధనకు కృషి

ఆదిలాబాద్: అమరుల ఆశయ సాధనకు కృషి చేస్తామని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్ అన్నారు. ఇటీవల మరణించిన సీపీఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బాల మల్లేశ్, పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్‌లకు సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆదివారం నివాళులర్పించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ముందుండి ఉద్యమం చేశారన్నారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్రా దేవేందర్, అరుణ్ కుమార్, చిల్కా దేవిదాస్, భాస్కర్, వసీంఖాన్ పాల్గొన్నారు.

ఆదివాసీ టీచర్లకు అన్యాయం

ఎదులాపురం: తెలంగాణలో ఆదివాసీ ఉపాధ్యాయులకు ప్రమోషన్ల విషయంలో తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆత్రం తనూష్ అన్నారు. ఆదివాసీ ఉద్యోగులు, నిరుద్యోగులకు జరుగుతున్న అన్యాయంపై న్యూఢిల్లీలో నిర్వహించిన సదస్సులో ఆదివారం ఆయన పాల్గొన్నారు. నాయకులు పూసమ్ సచిన్, భీంరావ్, విష్ణు, కిష్టన్న, సోమేశ్ పాల్గొన్నారు.

అభివృద్ధికి దూరంగా గ్రామాలు

- కనీస సౌకర్యాలు కరువు
- రోడ్డు లేక విద్య, వైద్యానికి దూరం
- పట్టించుకోని అధికారులు


చిన్నుమీయతండాకు వెళ్లే రాళ్ల దారి

బజార్‌హత్నూర్: మండలంలోని మారుమూల గిరిజన గ్రామాలు అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. మండలంలోని చిన్నుమీయతండా, రతన్‌గూడ, రాజులగూడ, భీమ్లానాయక్‌తండా, హర్కాయి గ్రామాలు ఏర్పడి ఏడు దశాబ్దాలు గడుస్తున్నా.. ఇప్పటి వరకు రోడ్డు, రవాణా సౌకర్యం లేక గిరిజనులు విద్య, వైద్యానికి దూరమవుతున్నారు. గ్రామాల్లోని ప్రజలు నిత్యవసర సరకులకు, రేషన్ కోసం, విత్తనాలు, ఎరువుల కోసం మండల కేంద్రానికి వెళ్లాంటే ఇబ్బందులు తప్పడం లేదు. కాలినడకన 8 కిలోమీటర్లు కాలినడకన వెళ్లాలి. అక్కడి నుంచి 15 కిలోమీటర్లు ఆటోల ద్వారా వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. దీంతో తమకు తిప్పలు తప్పడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్య, వైద్యానికి దూరం

ఈ గ్రామాల ప్రజలకు వర్షాకాలం వచ్చిందంటే ఆయా గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలినా.. వైద్య సిబ్బంది చేరుకోవడం గగనమే. దారి బురదమయం, రాళ్ల రప్పలతో ఉండడంతో సైకిల్ కూడా వెళ్లలేని దుస్థితి నెలకొంది. అత్యవసర వైద్యం అవసరం ఉన్న 8 కిలోమీటర్లు ఎడ్లబండిపై ప్రయాణం చేసిన తర్వాతే 108 అంబులెన్స్ సేవలు అందుతాయి. వర్షాకాలం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు వెళ్లడం కూడా కష్టంగా మారుతుంది. గ్రామాల్లో కనీస సౌకర్యాలు కరువడంతో అభివృద్ధికి దూరంగా ఉంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గిరిజన గ్రామాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలి

మా గ్రామంలో 40 కుటుంబాలు, 300 మంది జనాభా ఉంది. మా గ్రామం అటవీ ప్రాంతంలో ఉండడంతో అత్యవసర నిమిత్తం గుట్టలపై నుంచి రాళ్లదారిలో మండల కేంద్రానికి వెళ్లాలి. అక్కడి నుంచి టెంబికి కాలినడకన వెళ్లాలి. ప్రభుత్వ స్పందించి మా గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలి.

– ఇందల్‌సింగ్ నాయక్, చిన్నుమీయతండా

అధికారులకు విన్నవించాం

టెంబి పరిధిలోని చిన్నుమీయతండా గ్రామం టెంబి నుంచి 1 కిలోమీటరు దూరంలో ఉంటుంది. ఎత్తైన గుట్టలు ఉండడంతో రతన్‌గూడ, రాజులగూడ గ్రామాల మీదుగా అటవీ ప్రాంతం నుంచి 8 కిలోమీటర్లు కాలినడకన వచ్చి పనులు చేసుకుంటున్నారు. ఈ గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని పంచాయతీరాజ్ శాఖ, అటవీశాఖ అధికారులకు పలుమార్లు విన్నవించాం.

– సోమ రాము, మాజీ సర్పంచ్, టెంబి

నిర్లక్ష్యపు నిర్మాణాలు..!

- పిల్లర్ల గుంతలతో పొంచి ఉన్న ప్రమాదం
- పట్టించుకోని సంబంధిత కాంట్రాక్టర్
- మామూలుగా తీసుకుంటున్న ఐటీడీఏ అధికారులు


ప్రమాదకరంగా తవ్విన గుంతలు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో భవన నిర్మాణంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం విద్యార్థులకు శాపంగా మారింది. గురుకుల పాఠశాల ఆవరణలో రూ. 45 లక్షలతో అదనపు భవన నిర్మాణం పనులు ప్రారంభించారు. పాఠశాల, కళాశాల ఆవరణలో చేపడుతున్న పనుల్లో విద్యార్థులు ప్రమాదాలకు గురి కాకుండా కాంట్రాక్టర్, అధికారులు ముందుస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. కానీ ఇవేమి పట్టనట్టుగా భారీ గుంతలు తవ్వి వదిలేయడంతో విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉంది.

భారీ గుంతలు..

రూ. 45 లక్షలతో నిర్మించనున్న అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం గత పదిహేను రోజుల క్రితం సంబంధిత కాంట్రాక్టర్ పిల్లర్ల కోసం భారీ గుంతలు తవ్వారు. ఒకొక్క గుంత కనీసం 6 నుంచి 7 ఫీట్ల లోతులో ఉంది. ఈ గుంతలు ప్రమాదకరంగా మారాయి.

రక్షణ లేకుండా పనులు..

పని ప్రదేశంలో జన సంచారం ఉంటే చుట్టూ రక్షణగా బారీకెడ్లు ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న పనులకు సమీపంలో తరగతి గదులు ఉన్నాయి. దాని పక్కనే డైనింగ్ హాల్ ఉంది. దాదాపుగా 600వందలకు పైగా విద్యార్థులు ఉన్నారు. ఒకవేళ అనుకోకుండా రాత్రి సమయంలో కానీకాలు గుంతలో పడితే విద్యార్థుల ప్రాణాలు గాలిలో కలిసిపోవాల్సిందే. పనులు పర్యవేక్షించాల్సిన ఐటీడీఏ ఇంజనీరింగ్ అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రక్షణ చర్యలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి



విద్యార్థుల విషయంలో అధికారులు ముందుస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రమాదం జరగక ముందే రక్షణ చర్యలు ఏర్పాటు చేయాలి. సంబంధిత అధికారులు పనులను పర్యవేక్షించి, విద్యార్థులు ప్రమాదాలకు గురికాకుండా చూడాలి.

– సింగారం రమేశ్, ఏబీవీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు

నిర్లక్ష్యం తగదు



గిరిజన గురుకుల పాఠశాలలో చదువుతున్న గిరిజన విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం తగదు. విద్యార్థులు ప్రమాదాల బారిన పడకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. విద్యార్థులకు ఏదైనా ప్రమాదం జరిగితే ఐటీడీఏ ఇంజనీరింగ్ అధికారులదే.

– నిమ్మల సంతోష్‌రెడ్డి, సామాజిక కార్యకర్త

జాతర విజయవంతం చేయండి

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని బంగారిగూడ శివారులోని శ్రీఅలివేల మంగపద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు, జాతరకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈనెల 20 నుంచి 22 వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్, ఆకుల ప్రవీణ్, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

హిందువులపై దాడులు సరికాదు

ఆదిలాబాద్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు సరికాదని, ఈ దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఇస్కాన్ సంస్థ కుల మతాలకతీతంగా పనిచేస్తుందన్నారు. బంగ్లాదేశ్ ఇస్కాన్ ఆలయాలపై హిందువులపై జరుగుతున్న దాడులను ప్రపంచం మొత్తం ఖండిస్తుందన్నారు. ఈనెల 4న విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో చేపట్టే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు వేణుగోపాల్, నగేశ్, ఆకుల ప్రవీణ్, కృష్ణ యాదవ్, జోగు రవి, దినేష్ మటోలియా, విజయ్, రాజన్న, సోమ రవి, దయాకర్, అర్జున్ పాల్గొన్నారు.

విలీన ప్రక్రియను స్వాగతిస్తున్నాం

ఎదులాపురం: ట్రైబల్ టీచర్స్ ఫెడరేషన్ విలీన ప్రక్రియను స్వాగతిస్తున్నామని టీటీఎఫ్ టీఎస్ రాష్ట్ర నాయకులు రాథోడ్ గణేష్, జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ పవార్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో గిరిజన ఉపాధ్యాయ సంఘాలైన టీటీఎఫ్ టీఎస్, టీఎస్టీటీఎఫ్ సంఘాలు గిరిజన ఉపాధ్యాయుల హక్కుల కోసం పని చేస్తున్నాయన్నారు. పదోన్నతుల విషయంలో తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఇందుకోసం సంఘటితంగా పోరాటం చేయాలనే ఉద్దేశంతో రెండు గిరిజన సంఘాలు ఐక్యంగా పోరాటం చేయడానికి ముందుకు వచ్చాయన్నారు. సమావేశంలో నాయకులు నరేశ్, జాదోత్ రవీందర్, మదన్, పాండురంగ్, జగదీష్ పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహిస్తాం


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో క్రికెట్ టోర్నమెంట్ కరపత్రాలు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలతో క్రీడాకారుల్లో నైపుణ్యం మెరుగుపడుతుందన్నారు. క్రీడాకారులను జోగు ఫౌండేషన్ తరఫున ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జనార్దన్, ప్రభాకర్, సుకుమార్, మని వర్ధన్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు

నేరడిగొండ: చదువుతోనే సమాజంలో గుర్తింపు ఉంటుందని ఉట్నూర్ ఐటీడీఏ డీడీ జాదవ్ వసంత్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని కొర్టికల్(కె) బాలుర ఆశ్రమోన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం తరగతుల వారీగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలన్నారు. అలాగే పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధన చేయాలని సూచించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు గంగారాం, డిప్యూటీ వార్డెన్ రాథోడ్ హేమాజీ, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని వాగ్ధారి నుంచి సవర్గావ్ గ్రామం వరకు నూతన గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేను గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాలు ఎన్నికల సమయంలో చేస్తామని, గ్రామాన్ని అభివృద్ధి చేసే బాధ్యత తనపై ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, తిరుమల గౌడ్, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శివారెడ్డి, బాబులాల్, మారుతి, గులాబ్, చంద్రశేఖర్, మహేందర్, విలాస్, సంతోష్, సురేందర్ పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

బోథ్: మండలంలోని కై లాస్ టెకిడి నర్మదేశ్వర ఆలయ 22వ వార్షికోత్సవ పోస్టర్‌ను ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నేరడిగొండ మండల కేంద్రంలోని తన నివాసంలో లింబాజీ మహరాజ్‌తో కలిసి ఆవిష్కరించారు.

ఎమ్మెల్యే కలిసిని సాథ్‌నంబర్ గ్రామస్తులు

ఇచ్చోడ: మండలంలోని సాథ్‌నంబర్ గ్రామస్తులు ఆదివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌ను మార్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఇచ్చోడ మండలంలోని పలు గ్రామాల లబ్ధిదారులకు ఆదివారం బోథ్ ఎమ్మెల్యే సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ముఖరా(బి) గ్రామానికి చెందిన పద్మినిబాయికి రూ. 20 వేలు, మన్సూర్‌కు రూ. 12 వేలు, జల్దా గ్రామానికి చెందిన అరుణ్‌కు రూ. 31 వేలు, గౌస్ పాషాకు రూ. 36 వేల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖరా(బి) మాజీ సర్పంచ్ అడవ్‌మారుతి, జల్దా మాజీ సర్పంచ్ నందకిషోర్ పాల్గొన్నారు.

సన్మానం

తాంసి: భీంపూర్ మండలంలోని భగవాన్‌పూర్ గ్రామస్తులు ఆదివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామానికి ఉన్న రోడ్డు అధ్వాన్నంగా మారడంతో మట్టి రోడ్డును బాగు చేయాలని విన్నవించారు. రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేయిస్తానని హామీ ఇచ్చారు. మండల నాయకులు గంగయ్య, నితిన్, కొడాల మహేందర్, తదితరవులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కిష్టయ్య వర్ధంతి


నివాళులర్పిస్తున్న నాయకులు

నేరడిగొండ: మండలంలోని కుమారి గ్రామంలో కానిస్టేబుల్ కిష్టయ్య వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొజ్జ నారాయణ, సలీంద్ర శివయ్య, మందుల రమేశ్, సుంకర రాములు, రమణయ్య, గంగాధర్, నడిపెన్న పాల్గొన్నారు.

సిరికొండ: తెలంగాణ మలిదశ ఉద్యమ పోరాట తొలి అమరుడు కానిస్టేబుల్ కిష్టయ్య జయంతి, వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సిరికొండ ముదిరాజ్ సంఘం గౌరవ అధ్యక్షుడు ఒరగంటి పెంటన్న ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఆదివారం కిష్టయ్య వర్ధంతిని పురస్కరించుకుని సిరికొండలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు ఒరగంటి విజయ్ కుమార్, సభ్యులు ఎగ్గిడి మల్లన్న, ఒరగంటి నర్సింలు, శాగంటి ఆశన్న, ఎగ్గిడి ఇస్తారి, ఒరగంటి వీరన్న, అశోక్, మహేశ్, ప్రవీణ్, కంచం రమేశ్, రుద్రారపు చిన్న మల్లన్న పాల్గొన్నారు.

బోథ్: తెలంగాణ మలిదశ ఉద్యమ తొలి అమరుడు పోలీస్ కిష్టయ్య వర్ధంతిని బోథ్ మండలంలోని కౌఠ(బి) గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కిష్టయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. గ్రామ అధ్యక్షుడు, సింగిల్ విండో చైర్మన్ సున్నపు శ్రీనివాస్, బొజ్జ నారాయణ, సలేంద్ర శివయ్య, మందుల రమేశ్, నరసయ్య, రాజేశ్వర్, ముత్యం సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు


వ్యాసరచన పోటీలు పరిశీలిస్తున్న ఎంపీడీవో

తాంసి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో ఆదివారం పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ప్రజా పాలన దినోత్సవాల సందర్భంగా మండల స్థాయి పోటీలు నిర్వహించగా పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలను ఎంపీడీవో గడ్డం మోహన్ రెడ్డి పర్యవేక్షించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీకాంత్, ఉపాధ్యాయులు ఉమా మహేశ్వర్, గ్రామ మాజీ సర్పంచ్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ బాలికల పాఠశాలలో ఆదివారం ప్రజాపాలన ప్రజా విజయోత్సవ వేడుకల సందర్భంగా విద్యార్థులకు పునరుత్పాదక ఇంధన వనరుల ఆవశ్యకతపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం ఏఎంవో శ్రీకాంత్ గౌడ్ విద్యార్థులకు ఇంధన వనరుల గురించి వివరించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి కుమ్మరి పోశెట్టి పాల్గొన్నారు.

సింహగర్జనకు తరలిన నాయకులు


హైదరాబాద్ వెళ్తున్న మాల సంఘం నాయకులు

ఇచ్చోడ: మండల కేంద్రానికి చెందిన మాల సంక్షేమ సంఘం నాయకులు ఆదివారం ఉదయం సింహగర్జన సభ తరలివెళ్లారు. ఈసందర్భంగా మాల సంక్షేమ సంఘం నాయకులు శాంతపూరం రాజేశ్వర్ మాట్లాడుతూ.. మాలల హక్కుల కోసం నిర్వహిస్తున్న సభకు మండలం నుంచి పెద్ద సంఖ్యలో తరలి వెళ్లినట్లు తెలిపారు. కార్యక్రమంలో బొజ్జ లక్ష్మణ్, అక్కెపెల్లి లక్ష్మణ్, బత్తుల ఉశన్న, మైల మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన మాలల సింహగర్జన సభకు మండల కేంద్రంతో పాటు సోనాల గ్రామం నుంచి మాలసంఘం సభ్యులు తరలివెళ్లారు. తమ డిమాండ్ల సాధన కోసం ఉద్యమం చేపడతామన్నారు. తరలివెళ్లిన వారిలో ఎలుక రాజు, తదతరులు ఉన్నారు.

ఇంద్రవెల్లి: మాలల సింహగర్జన సభకు ఇంద్రవెల్లి దళిత సంఘాల నాయకులు తరలివెళ్లారు. శనివారం రాత్రి నుంచే వేల సంఖ్యలో బహుజనులు వాహనాల్లో తరలివెళ్లారు. కార్యక్రమంలో అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల కమిటీ అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్, కామ్‌రాజ్ వాగ్మరే, దిలీప్ మోరే, సంతపురి రాజేశ్వర్, మస్కే రాజువర్ధాన్, శివాజీ, భారత్, బాలాజీ, ఆనంద్‌రావ్, జితేందర్ పాల్గొన్నారు.

నేరడిగొండ: సింహగర్జనకు నేరడిగొండ మండలం నుంచి మాలలు తరలివెళ్లారు. ఆదివారం హైదరాబాద్‌లోని పరేడ్ మైదానంలో గర్జన సభ నిర్వహించారు. ఈ సభకు వాంకిడి వడూర్, కొర్టికల్, తర్నం, కుప్టి, కుమారి, బుద్దికొండ, సవర్గాంతో పాటు వివిధ గ్రామాల నుంచి మాలలు వేలాదిగా తరలివెళ్లారు. మాలలు జాతి కోసం సంఘటితమై తమ హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

బాధ్యతాయుతంగా పనిచేస్తేనే గుర్తింపు

తాంసి: ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతాయుతంగా పనిచేస్తేనే గుర్తింపు ఉంటుందని మండల ప్రత్యేకాధికారి సీపీవో వెంకట రమణ అన్నారు. తాంసి మండల పరిషత్ కార్యాలయంలో 30 ఏళ్ల పాటు సబార్డినేట్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఎండి. వాహిద్‌ను ఆదివారం కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. సీపీవో, ఎంపీడీవో మోహన్ రెడ్డి, కార్యాలయ సిబ్బందితో కలిసి సబార్డినేట్‌ను సత్కరించారు. సన్మాన కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్, గణేష్ జాదవ్, సూపరిటెండెంట్ రాధ, ఏపీవో విజయ పాల్గొన్నారు.

హిందువులపై దాడిని ఖండించాలి


మాట్లాడుతున్న శ్రీమాన్ గౌర్‌నామ ప్రభూజీ

ఆదిలాబాద్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఖండించాలని ముంబైకి చెందిన ప్రతినిధి శ్రీమాన్ గౌర్‌నామ ప్రభూజీ అన్నారు. ఆదివారం కేంద్రంలోని రాంపూర్ ఇస్కాన్ ఆలయంలో హిందూ ఉత్సవ సమితి, ఇస్కాన్ ఆదిలాబాద్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నామన్నారు. ఇస్కాన్ స్వామిజీలను అరెస్టు చేయడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, కోశాధికారి సూర్యకాంత్, కందుల రవీందర్, ఇస్కాన్ ప్రతినిధులు పూర్ణ కృష్ణదాస్, శ్రీనివాస్ దాస్, రాజేందర్, వికంత్, విశాలిని, ప్రసన్న కుమారి, విష్ణు ప్రియ పాల్గొన్నారు.

స్వామియే శరణం అయ్యప్ప


పల్లకి ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్: అయ్యప్ప స్వామి శరణుఘోషతో ఆదివారం జిల్లా కేంద్రంలోని పుర వీధులు మార్మోగాయి. అయ్యప్ప మాలధారులు ఆరట్టు మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తి గీతాలు, నృత్యం నడుమ స్వామివారిని పల్లకిలో ఊరేగించారు. దీంతో జిల్లా కేంద్రం ఆధ్యాత్మికత సంతరించుకుంది. కార్యక్రమంలో గోపాలకృష్ణ మఠాధిపతి యోగానంద సరస్వతి స్వామి, ఎమ్మెల్యే పాయల్ శంకర్, మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న, ప్రమోద్ కుమార్ ఖత్రి, అయ్యప్ప స్వామి మాలదారులు పాల్గొన్నారు.